


అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




సంపుటి - 3 సంచిక -24 ఆదివారం 21 జూన్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Disircts

# ఆరోగ్యమే అభివృద్ధికి అసలైన సూచిక



**పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా తెలంగాణ**

**పేదలకు అండగా నిలవడమే నిజమైన వైద్యం**

**వైద్యం సామాన్యుడికి అందుబాటులో ఉండాలి**

**వ్యాధి చికిత్స కంటే నివారణెళి మిన్న**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**


**హైదరాబాద్,జూన్ 20(జర్నలిస్ట్ వార్త):**
ప్రజల ఆరోగ్యమే అత్యున్నతమైన అభివృద్ధికి అసలైన నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇండియా హెల్త్ సమిట్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైద్య రంగ నిపుణులు, ప్రముఖ వైద్యులు, హాస్పిటల్స్, ఫార్మా, బయోటెక్నాలజీ, డిజిటల్ హెల్త్ రంగానికి చెందిన ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆరోగ్యం అనేది కేవలం ఒక ప్రభుత్వానికి సంబంధించిన అంశం కాదన్నారు. ప్రతి ఒక్కరి ప్రాథమిక అవసరమని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా కుప్పకూలిపోతుందని, వారి జీవితాంతం దాచుకున్న పొదుపు మొత్తం **మిగతా 2లో...**

# పోక్సో కేసులో బండి భగీరథ్‌కు మధ్యంతర బెయిల్



**హైదరాబాద్:జూన్ 20(జర్నలిస్ట్ వార్త):**
పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా జైలులో ఉన్న కేంద్ర మంత్రి తనయుడు బండి భగీరథ్ కి మేడ్చల్ మల్కాజ్‌గిరి కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన శనివారం చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యారు. ఇంజినీరింగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని భగీరథ్ తరఫు న్యాయవాదులు కోర్టును ఆశ్రయించారు. విద్యా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని న్యాయవాదులు చేసిన వాదనలను పరిశీలించిన న్యాయస్థానం**మిగతా 2లో...**

# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్



**యోగాకు గుర్తింపు తెచ్చిన ఆధ్యాత్మిక వేత్త బాబా రాందేవ్**

**ఉండవల్ల గుహల వద్ద అంతర్జాతీయ యోగా నిర్వహణ**

**బాబాతో కలసి ఆసనాలు వేసిన చంద్రబాబు**

**చంద్రబాబు విజినరీ నేత అన్న బాబా రాందేవ్**

**అమరావతిజూన్ 20(జర్నలిస్ట్ వార్త):**
: దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాజధాని అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాందేవ్ బాబా శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా వివిధ రకాల యోగా ప్రక్రియలను రాందేవ్ బాబా సీఎంకు వివరించారు. బాబారామ్‌దేవ్‌తో కలిసి సీఎం యోగా సాధన చేశారు. **మిగతా 2లో...**



# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

**రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోడీ ప్రకటన**

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ప్రారంభించిన ప్రధాని**

**ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోడీ**

**అభివృద్ధి చేసి సోలార్ విలేజ్‌గా మారుస్తామని ప్రకటన**

**భువనేశ్వర్,జూన్ 20(జర్నలిస్ట్ వార్త):**
ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో **మిగతా 2లో...**

# పరేడ్ గ్రౌండ్ యోగా

**హైదరాబాద్,జూన్20:** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో పెద్ద ఎత్తున యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీగా ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు హాజరయ్యారు. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎంపీలు ఈటల రాజేందర్, లక్ష్మణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, సినీ నటులు నవీన్ పోలిశెట్టి, డింపుల్ హయాతి తదితరులు**మిగతా 2లో...**



# నిరాహార దీక్ష చేస్తా

## : కాంగ్రెస్ ప్రభుత్వానికి కవిత వార్నింగ్

**సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి జిల్లాలోని గనిని సందర్శించిన కవిత**

**మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న 1200 మంది ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్**

**ఉద్యోగాలు ఇవ్వకపోతే జులై 20 నుంచి నిరాహార దీక్షకు కూర్చుంటానని హెచ్చరిక**

**జూన్ 20(జర్నలిస్ట్ వార్త):**
సింగరేణి 'బాయిబాట' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే-5 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై**మిగతా 2లో...**




# నేడు నీట్ రీ-ఎగ్జామ్

## నిర్వహణకు సర్వం సిద్ధం

**దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది దరఖాస్తు**

**రాష్ట్రంలో 199 పరీక్షా కేంద్రాలు, 73,084 మంది విద్యార్థులు**




**హైదరాబాద్‌జూన్ 20(జర్నలిస్ట్ వార్త):**
వైద్య విద్య ప్రవేశాలకు నిర్వహించే నీట్ (యూజీ)-2026 రీ-ఎగ్జామ్ ఆదివారం జరగనుంది. ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో రద్దు చేసిన గత పరీక్షకు బదులుగా జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ఈ రీ-ఎగ్జామ్‌ను నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్ష కోసం నమోదు చేసుకున్నారు. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో 5,432 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నారు. **మిగతా 2లో...**

# 'మెట్రో' పై కిషన్ రెడ్డికి రేవంత్ మరో లేఖాస్త్రం

**రైల్వే మంత్రితో భేటీకి ఏర్పాట్లు చేయాలని కిషన్ రెడ్డికి విజ్ఞప్తి**

**అధికారులు, పత్రాలతో సమావేశానికి హాజరవుతానని వెల్లడి**

**జూన్ 22, 23 తేదీల్లో ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న ముఖ్యమంత్రి**

**హైదరాబాద్‌జూన్ 20(జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. జూన్ 22, 23 తేదీల్లో తాను **మిగతా 2లో...**



# కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

**: తెలంగాణ 'సర్' ప్రక్రియపై ఎస్ఈవో సుదర్శన్‌రెడ్డి**

**కొత్త ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ తప్పుడు ప్రచారం**

**బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికి వస్తారన్న ఎస్ఈవో సుదర్శన్ రెడ్డి**

**కొత్త ఓటర్లు వారి వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ**

**హైదరాబాద్‌జూన్ 20(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ఓటర్లకు, యువతకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈవో) సుదర్శన్ రెడ్డి చెక్ పెట్టారు. ఓటరు జాబితా ప్రక్షాళన కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ప్రక్రియపై ఈరోజు హైదరాబాద్‌లో మీడియా సమావేశం **మిగతా 2లో...**



# హార్ముజ్ మళ్లీ క్లోజ్

**ఇరాన్ కీలక నిర్ణయం**

**లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడుల ఎఫెక్ట్**

**అమెరికా తన హామీలను నెరవేర్చే వరకు చర్చల్లో ఎలాంటి పురోగతి ఉండదని వెల్లడి**



**టెహ్రాన్ : జూన్ 20(జర్నలిస్ట్ వార్త):**
ప్రపంచ ఇంధన సరఫరాకు కీలక మార్గమైన హార్ముజ్ జలసంధి మళ్లీ మూత పడింది. లెబనాన్‌లో ఇజ్రాయిల్ దాడులు ఆపకపోవడంతో హార్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్టు ఇరాన్ ప్రకటించింది. అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్ **మిగతా 2లో...**

# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్

**మొదటిపేజీ తరువాయి**

రామ్‌దేవ్ శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. యోగాకు.. రాందేవ్ బాబా మంచి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. యోగా సాధనతో ఆయన అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. ఆయన శిక్షణలో యువత యోగాసనాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందన్న సీఎం.. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని వివరించారు. బాబారామ్‌దేవ్ ఏదైనా చేయగలరన్నారు. యోగాకు.. రామ్‌దేవ్ మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. యోగా మన సంప్రదాయం, విజ్ఞానం, వారసత్వ సంపద అని చెప్పుకొచ్చారు. ప్రస్తుత సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందని సీఎం అన్నారు. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమని తెలిపారు. దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఏపీ మారనుందని పేర్కొన్నారు. ఉండవల్లి కొండల వద్ద యోగా.. చాలా అందమైన ఆలోచన అని



అన్నారు. అమరావతి కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ నేషన్స్‌ను ఒప్పించి ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 31శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. రాందేవ్‌బాబా మాట్లాడుతూ.. అభివృద్ధి, విజన్ కలిగిన సీఎం.. చంద్రబాబు అని కితాబిచ్చారు. ప్రధాని వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా సీఎం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోనే విజన్ ఉన్న నాయకుడని అన్నారు. గత 30 సంవత్సరాలుగా చంద్రబాబు ఏం అడుగుతారో.. తాము అది చేస్తున్నామని తెలిపారు. యోగా మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని రామ్‌దేవ్ బాబా తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అందర్నీ సమానంగా చూస్తారని.. అందుకే ప్రజలు ఆయన్ను దేవుడిలా భావిస్తారన్నారు. అమరావతి దేవతల రాజధాని అని.. ఇక్కడ 40 శాతం పచ్చదనం, 60 శాతం నిర్మాణాలు ఉంటాయన్నారు. ఇది దేవ భూమి అని వెల్లడించారు. స్విట్జర్లాంట్ కోసం వెళ్లాల్సిన అవసరం లేదని... ఆంధ్రప్రదేశ్ వస్తే చాలని చెప్పారు. ఇక్కడి మామిడికాయలు, అరటిపండ్లు చాలా బాగుంటాయని.. ఎందుకంటే వాటిని సహజ సిద్ధంగా పండిస్తారని తెలిపారు. ఈసారి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' పేరుతో నిర్వహిస్తున్నామని రామ్‌దేవ్ బాబా పేర్కొన్నారు.

## పోక్సో కేసులో బండి భగీరథ్‌కు మధ్యంతర బెయిల్

**మొదటిపేజీ తరువాయి**ఆయనకు వారంపాటు మధ్యంతర బెయిల్ మంజూరు ఇచ్చింది. ఇంజనీరింగ్ సెమిస్టర్ పరీక్షలు ఉన్నందున పరీక్షలకు హాజరయ్యేందుకు కోర్టు అతనికి తాత్కాలిక బెయిల్ ఈ నెల 26 వరకు మంజూరు చేసింది. గత నెల 16న పోక్సో కేసులో భగీరథ్ ను పోలీసులు అరెస్ట్ చేసారు. పేట బషీర్‌బాగ్ పోలీస్ స్టేషన్‌లో గత నెల 9న కేసు నమోదు తర్వాత అరెస్ట్ భయంతో పరారయిన నిందితుడు, ముందస్తు బెయిల్, లేదా అరెస్ట్ తరువాత మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అభ్యర్థిస్తూ తన న్యాయవాదుల ద్వారా హై కోర్టు ను ఆశ్రయించాడు. అయితే ఈ పిటిషన్ ను విచారించిన హై కోర్టు వెకేషన్ కోర్టు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించడంతో భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా పరీక్షల నిమిత్తం ఆయన జైలను నుంచి విడుదల అయ్యారు.

## పరేడ్ గ్రౌండ్ యోగా

**మొదటిపేజీ తరువాయి**పాల్గొని యోగా సాధన చేశారు. ఏటా మాదిరిగానే యోగా కార్యక్రమం నిర్వహించినట్టు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. నిత్యం యోగా చేయడం వల్ల రుగ్మతల బారిన పడకుండా ఉండొచ్చని తెలిపారు.



## నిరాహార దీక్ష చేస్తా





**మొదటిపేజీ తరువాయి**

తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న దాదాపు 1200 మంది వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఒక నెల రోజులు టైమ్ ఇస్తున్నామని, ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకపోతే జులై 20 నుంచి తాను నిరాహార దీక్షకు కూర్చుంటానని హెచ్చరించారు. సింగరేణిలో ఏ చిన్న పని జరగాలన్నా నేరుగా డిప్యూటీ సీఎం ఆఫీస్ నుంచే లంచాలు అడుగుతున్నారంటూ కవిత సంచలన ఆరోపణ చేశారు. కాంగ్రెస్ పాలనలో లాభాల్లో ఉన్న సింగరేణిని నష్టాల్లోకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. మొన్న జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడికి తీవ్ర గాయాలవడానికి యాజమాన్యం వాడుతున్న నాసిరకం డిటోనేటర్లే కారణమన్నారు. గనుల లోపల పని చేసే కార్మికులకు కనీసం స్వచ్ఛమైన గాలి, మంచి నీరు కూడా ఇవ్వకుండా అధికారులు కక్కుర్తి పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రిటైర్ అయిన కార్మికులకు సొంత ఇంటి కల నెరవేర్చడం కోసం సింగరేణికి ప్రత్యేకంగా 'హౌసింగ్ బోర్డు' ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం లేదా కార్మిక సంఘం తరపున రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. అలాగే విజిలెన్స్ ఎంక్వయిరీల పేరుతో కార్మికులను భయభ్రాంతులకు గురిచేయవద్దని అన్నారు. ఉద్యమ కాలం నుంచే తాను సింగరేణి కార్మికులతో కలిసి నడిచానని గుర్తుచేసిన కవిత... తెలంగాణ హక్కుల కోసం తాను స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' పార్టీని భూపాలపల్లి ప్రజలు, బొగ్గుగని కార్మికులు గుండెల్లో పెట్టుకుని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆరోగ్యమే అభివృద్ధికి అసలైన సూచిక

**మొదటిపేజీ తరువాయి**

ఒక్క క్షణంలో కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడు ఎటువంటి భయం లేకుండా ఆసుపత్రిలో అడుగుపెట్టేలా తక్కువ ధరకు వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. దేశం ఆర్థికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలోనే తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఎయిమ్స్ వంటి ఉన్నతమైన వైద్య విద్యాసంస్థలను స్థాపించి దేశానికి ఒక దిశను చూపించారన్నారు. పేద దేశంలో వైద్యం అనేది విలాసంగా మారకూడదనే ఉద్దేశంతో ఆనాడు పునాది వేశారన్నారు. అదేవిధంగా 1975లో ఇందిరా గాంధీ గారు తీసుకొచ్చిన సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకాన్ని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ హయాంలో తీసుకొచ్చిన యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ పక్రియను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లారన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి నాయకత్వంలో వచ్చిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, ఆశా వర్కర్ల వ్యవస్థ గ్రామీణ ఆరోగ్య ముఖచిత్రాన్ని మార్చివేసిందని గుర్తుచేశారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు ప్రవేశపెట్టిన 'ఆరోగ్యశ్రీ' పథకం పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఇచ్చిందన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చావుకు దగ్గర కాకూడదని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతానికి నిదర్శనమని అన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందిస్తూ, గుండె, కిడ్నీ వంటి ఖరీదైన జబ్బులకు సైతం పేదవాడు ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేలా ఈ పథకం అండగా నిలిచిందన్నారు. వైద్య రంగంలో వస్తున్న టెక్నాలజీ, టెలిమెడిసిన్, సరికొత్త పరికరాలు కేవలం కార్పొరేట్ వర్గాలకే పరిమితం కాకుండా అట్టడుగు వర్గాలకు సైతం అందాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. నాయకత్వం అనేది ఒక సర్టిఫికేట్ కాదు, అదొక బాధ్యత అని వ్యాఖ్యానిస్తూ, సైన్స్ అనేది సామాన్యుడికి, టెక్నాలజీ అనేది పేదవాడికి సేవ చేయాలన్నారు. ప్రస్తుత వైద్య విధానం వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించే 'ఇల్‌నెస్ కేర్' గా మాత్రమే ఉండిపోకూడదన్నారు. వ్యాధి రాకుండా ముందే నివారించే 'వెల్‌నెస్ కేర్' గా మారాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఐసీయూల కంటే వ్యాధి నివారణెళి అత్యంత చౌకైన మార్గమని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ నేడు దేశంలోనే పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా అవతరించిందని భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రంలోని జిల్లా ఆసుపత్రుల బలోపేతం, వైద్య విద్యాసంస్థల విస్తరణ, నర్సింగ్ మరియు పారామెడికల్ రంగాలను ప్రోత్సహించడం ద్వారా వైద్య రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నామని అన్నారు. వైద్య రంగంలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం అనేది కేవలం వ్యాపార లాభాల కోసం కాకుండా, ప్రభుత్వ ఆశయాలకు ప్రైవేట్ రంగానికి ఉన్న నైపుణ్యాలను జోడించి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడానికే ఉపయోగపడాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వచ్చే దశాబ్ద కాలంలో వైద్య రంగానికి అవసరమైన మానవ వనరులను, నైపుణ్యాలను అందించడానికి తెలంగాణ పూర్తిగా సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌లో ఉన్న బలమైన ఫార్మాస్యూటికల్ బేస్, మెడికల్ డివైజెస్ పార్క్, ఐటీ టాలెంట్ మరియు ప్రభుత్వ అండదండల వల్ల తెలంగాణ ప్రపంచంలోనే మెడికల్ ఎక్సలెన్స్ ఇకోసిస్టమ్‌కు కేంద్రంగా మారిందన్నారు. ఇక్కడి నుంచే భారతదేశానికి, ప్రపంచానికి ఉపయోగపడే సరికొత్త హెల్త్ కేర్ ప్రొటోకాల్స్, డయాగ్నోస్టిక్స్ మరియు డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లు రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు.

# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

**మొదటిపేజీ తరువాయి**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్వ' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# నేడు నీట్ రీ-ఎగ్జామ్

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ నుంచి 73,084 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మొత్తం 199 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాయి. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పెన్-అండ్-పేపర్ విధానంలో జరుగుతుంది. బయోమెట్రిక్ ధృవీకరణ, బహుళస్థాయి తనిఖీలు, కేంద్రాల పర్యవేక్షణ కోసం ప్రత్యేక చర్యలు అమలు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి. పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలననీ, నిషేధిత వస్తువులను తీసుకురావద్దని పరీక్ష నిర్వహణా సంస్థ ఎన్‌టీఏ హెచ్చరించింది. డ్రస్ కోడ్, ప్రవేశ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. సోషల్ మీడియాలో ప్రశ్నాపత్రాలు, ఆన్సర్ కీలు, ప్రత్యేక సేవల పేరుతో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని అభ్యర్థులకు సూచించిం ది. అధికారిక సమాచారం కోసం ఎన్‌టీఏ వెబ్‌సైట్, ధృవీకరించిన వాట్సాప్ సేవలను ఉపయోగించుకోవాలని తెలిపింది. పరీక్ష నిర్వహణకు ముందు దేశవ్యాప్తంగా శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించి కేంద్రాల సన్నద్ధతను పరిశీలించినట్టు అధికారులు తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా పరీక్ష నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది.

# హార్ముజ్ మళ్లీ క్లోజ్

**మొదటిపేజీ తరువాయి**

ఈ దాడులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించింది. అమెరికా తన బాధ్యతల నుంచి తప్పుకోవడాన్ని నిరసిస్తూ ఇరాన్ ఉమ్మడి సైనిక కమాండ్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇజ్రాయిల్ దాడులు, అమెరికా నమ్మకద్రోహానికి ఇది మొదటి అడుగేనని, దాడులు ఆగకపోతే తదుపరి కఠిన చర్యలు ఉంటాయని ఇరాన్ హెచ్చరించింది. మరోవైపు స్విట్జర్లాండ్‌కు తమ దౌత్య బృందాన్ని పంపుతున్నట్టు ప్రకటిస్తూనే అమెరికా తన హామీలను నెరవేర్చే వరకు చర్చల్లో ఎలాంటి పురోగతి ఉండబోదని టెహ్రాన్ తేల్చి చెప్పింది. సైనిక హెచ్చరికల తర్వాత ఇరాన్ తన దౌత్య వ్యూహాన్ని కూడా మార్చింది. గత శుక్రవారమే జరగాల్సి ఉండి రద్దయిన స్విట్జర్లాం డ్‌లో శాంతి చర్చల కోసం తమ ప్రతినిధి బృందం బయలుదేరినట్టు ఇరాన్ ప్రకటించింది. అయితే ఈ పర్యటన కేవలం అమెరికాను నిలదీయడానికేనని స్పష్టం చేసింది. లెబనాన్‌లో యుద్ధం ఆపడం సహా కీలక హామీలను అమెరికా నెరవేరిస్తేనే తుది ఒప్పందంపై చర్చలు ముందుకు సాగుతాయని తెలిపింది. ఈ అవగాహన ఒప్పందంలో ఏ ఒక్క నిబంధన ఉల్లంఘించినా, మొత్తం శాంతి ప్రక్రియే ప్రమాదంలో పడుతుందని ఇరాన్ హెచ్చరించింది.

కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ లెబనాన్‌లో ఇజ్రాయిల్ తరచూ దాడులు జరపడంపై ఇరాన్ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఈ కారణంతోనే ఇరాన్ హార్ముజ్ జలసంధి మూసివేత కఠిన నిర్ణయాన్ని తీసుకుంది. వాస్తవానికి అమెరికా- ఇరాన్ ఒప్పందంలో ఇటు ఇజ్రాయిల్ గానీ, అటు హిజ్బుల్లా గానీ భాగస్వాములు కావు. తాము హిజ్బుల్లాను పూర్తిగా నిర్మూలించే వరకు దక్షిణ లెబనాన్ నుంచి సైన్యాన్ని వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. ఈ దాడుల వల్ల స్విట్జర్లాండ్‌లో అమెరికా, ఇరాన్, ఖతార్ దౌత్యవేత్తల మధ్య జరగాల్సిన ఉన్నత స్థాయి చర్చలు మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తున్నాయి. కాగా తాజా పరిణామాల నేపథ్యంలో ఇంధన ధరలకు మళ్లీ రెక్కలు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే వచ్చే వారం వాషింగ్టన్‌లో ఇజ్రాయిల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య జరగబోయే అమెరికా మధ్యవర్తిత్వ చర్చలైనా ఈ సంక్షోభానికి తెరదించుతాయో లేదో చూడాలని విశ్లేషకులు చెప్తున్నారు.

## కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు.సుదర్శన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల జూన్ 25 నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ స్వయంగా రానున్నారు. వారు ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారు. ఈ వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేసి జూలై 25 లోపు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఎవరైనా కొత్తగా ఓటు హక్కు పొందాలనుకుంటే అదే ఫారంలో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు.ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేందుకు ఇప్పటికే మ్యాపింగ్ వేగంగా సాగుతోంది. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే 80 శాతం మ్యాపింగ్ పనులు పూర్తయ్యాయి. 2002 నాటి ఓటరు డేటాతో అనుసంధానమైన వారికి కొత్తగా ఎలాంటి ఇతర డాక్యుమెంట్లు అవసరం లేదు. వలస వచ్చిన వారు లేదా కొత్త ఓటర్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన ప్రామాణిక పత్రాలను అనుమతిస్తామని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

ఈ మొత్తం డ్రైవ్ పారదర్శకంగా సాగేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అన్ని ప్రక్రియలు ముగించుకుని అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని తెలిపారు.

## 'మెట్రో' పై కిషన్ రెడ్డికి రేవంత్ మరో లేఖాస్త్రం

**మొదటిపేజీ తరువాయి**

ఢిల్లీ పర్యటనలో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత పత్రాలతో వస్తానని, అధికారులతో కలిసి సమావేశానికి హాజరవుతానని ఆ లేఖలో పేర్కొన్నారు.ప్రధానంగా మెట్రో మొదటి దశకు సంబంధించిన ఐఆర్ఎఫ్‌సీ (ఐఆర్ఎఫ్‌సీ) నిధుల విడుదల, రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులపై చర్చించాల్సి ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరానికి మెట్రో రైలు అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. పెండింగ్ అంశాలపై త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తన లేఖలో వివరించారు.

# పీఎం కిసాన్ డబ్బులు విడుదల

**రూ. 2,000 చొప్పున 18,880 కోట్లు జమ**

**హుగ్లీ జిల్లాలో విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ**



**కోల్‌కతా,జూన్ 20(జర్నలిస్ట్ వార్త):**పీఎం కిసాన్ డబ్బులు విడుదలయ్యాయి. ప్రధాని మోదీ 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.44 కోట్ల మందికి పైగా అర్హులైన రైతు కుటుంబాల ఖాతాల్లోకి రూ. 2,000 చొప్పున మొత్తం రూ. 18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ది చేకూరింది. కేంద్రప్రభుత్వం 2019లో పీఎం-కిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్దిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్దిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇ-కేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్‌లో ఇ-కేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.

# స్పందించని అధికారులు..

## మూసుకుపోతున్న రహదారులు- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు




**తల్లాడ /జూన్ 20 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల పరిధిలోని పలు రహదారులపై నిర్వహణ లోపం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దారి చూపే సూచిక బోర్డులు దెబ్బతిన్నప్పటికీ వాటి మరమ్మతులపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు.

అలాగే ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోని రహదారుల ఇరువైపులా చెట్లు, పొదలు విస్తరించి రోడ్డుపైకి అల్లుకుపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా సాయంత్రం, రాత్రి వేళల్లో రహదారులు స్పష్టంగా కనిపించక ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

దారి సూచించే బోర్డులు లేకపోవడం, చెట్ల కొమ్మలు రహదారిని కప్పివేయడంతో కొత్త ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు దారి తప్పే అవకాశాలు పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదాలు జరిగే ముందు సంబంధిత శాఖ అధికారులు స్పందించి దెబ్బతిన్న బోర్డులను పునరుద్ధరించడంతో పాటు రహదారుల వెంట పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారుల సమస్యలను పరిష్కరించి బాటసారులు, ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యం కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ముఖ్యమంత్రి మాట్లాడే భాష మార్చుకోవాలి

### ఉదయ్ స్వేరో డిమాండ్



**వైరా/ జూన్ 20 (జర్నలిస్ట్ వార్త):** మాజీ అదనపు డీజీపీ, బీఆర్ఎస్ నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అసోసియేషన్ జేఏసీ జిల్లా కన్వీనర్ ఉదయ్ స్వేరో డిమాండ్ చేశారు. వైరాలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులు మరియు ఉన్నత పదవుల్లో ఉన్నవారు హుందాగా మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తులపై విమర్శలు చేసే సందర్భంలో వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. గురుకుల విద్యాసంస్థలకు సంబంధించిన జీవో నెం.17, టెండర్ల ప్రక్రియపై ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. టెండర్ల వ్యవహారంలో అక్రమాలు జరిగాయని తమకు అనుమానాలు ఉన్నాయని, వాటిపై ప్రభుత్వం సమగ్ర వివరణ ఇవ్వాలని అన్నారు. అలాగే స్థానిక కాంట్రాక్టర్లకు తగిన అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గురుకుల పాఠశాలల టెండర్లలో పాల్గొనే అర్హత ప్రమాణాలు చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లకు ఇబ్బందికరంగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. గురుకుల విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ గురుకులాల అభివృద్ధికి చేసిన సేవలను గుర్తించి, ఆయనపై చేసిన వ్యాఖ్యల విషయంలో ముఖ్యమంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జేఏసీ, ఆర్ఎస్‌పీ సైన్యం నాయకులు శ్రీనాథ్, బి. వెంకటేశ్వర్లు, శ్రీధర్, కె. ప్రసాద్, చిరంజీవి, శ్రీనివాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగింటి ఆడపడుచు భువనేశ్వరికి జన్మదిన శుభాకాంక్షలు

### -టీడీపీ నాయకుడు నారపోగు ప్రసాద్ బాబు



**కల్లూరు, /జూన్ 20 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను కల్లూరు మండల కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ నాయకుడు నారపోగు ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో మహిళలతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారపోగు ప్రసాద్ బాబు మాట్లాడుతూ, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీగా నారా భువనేశ్వరి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి విశేష సేవలందిస్తున్నారని అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ విద్య, వైద్యం, సామాజిక సేవా రంగాల్లో ఆమె చేసిన కృషి ఆదర్శనీయమని పేర్కొన్నారు. హెరిటేజ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా విజయవంతమైన వ్యాపారవేత్తగా, సమాజ సేవకురాలిగా, కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన వ్యక్తిగా నారా భువనేశ్వరి ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. ఆమె మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు సునీత, రుక్మిణి తదితరులు, పార్టీ కార్యకర్తలు దాసు, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా మహిళలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుని భువనేశ్వరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు

# బీఎస్పీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడిగా బొడ్డు బాబురావు





**నేలకొండపల్లి/ జూన్ 20 (జర్నలిస్ట్ వార్త):** బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నేలకొండపల్లి మండల అధ్యక్షుడిగా బొడ్డు బాబురావును పార్టీ నాయకత్వం నియమించింది. మండలంలోని పైనంపల్లి గ్రామానికి చెందిన బాబురావు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పేద ప్రజలకు అండగా నిలుస్తూ వస్తున్నారు.

పార్టీలో సెక్టార్ అధ్యక్షుడిగా, అనంతరం మండల ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన ఆయన, అంచెలంచెలుగా ఎదిగి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ నాయకత్వం మండల అధ్యక్ష పదవిని అప్పగించింది. ఈ సందర్భంగా బొడ్డు బాబురావు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మండలంలో బీఎస్పీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆయన నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో బీఎస్పీ పార్లమెంట్ ఇన్‌చార్జి బుర్ర ఉపేంద్ర సాహు, జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు పల్లెపొంగు విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రామయ్య, జిల్లా కార్యదర్శులు బి. ఉపేందర్, కారుమంచి నాగరాజు, కోటయ్య, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# వైద్య అధికారిని సన్మానించిన సోషల్ వర్కర్లు



**కల్లూరు/, జూన్ 20 (జర్నలిస్ట్ వార్త):** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌ను శనివారం సోషల్ వర్కర్లు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌కు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వైద్య సిబ్బందితో చర్చించి, ఆసుపత్రి పరిస్థితులను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది చేస్తున్న కృషిని వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏనుముల రుక్మిణి, జర్నలిస్టు వార్త ఖమ్మం జిల్లా అధికార ప్రతినిధి నారపోగు ప్రసాద్‌బాబు, రాజు, అదురు సునీత, రవి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపెండ్యాలలో భూ వివాదం..

## న్యాయం కోసం రైతు వేడుకోలు



**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో జూన్ 20 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామంలోని సర్వే నంబర్ 94 భూమికి సంబంధించిన వివాదంలో తనకు న్యాయం చేయాలని గ్రామానికి చెందిన రైతు మురుగు కనకయ్య అధికారులను కోరారు. శనివారం తన వ్యవసాయ బావి వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తన సమస్యను వివరించారు.

కనకయ్య మాట్లాడుతూ, తమ తాతముత్తాతల కాలం నుంచి కుటుంబ సభ్యులు సాగు చేస్తున్న భూమిలోనే జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు. భూమిలో బావి, విద్యుత్ కనెక్షన్, వ్యవసాయ సదుపాయాలు ఉన్నాయని, ఎన్నో ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నప్పటికీ ప్రస్తుతం భూమి హక్కులకు సంబంధించి వివాదం తలెత్తడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తన వద్ద ఉన్న భూమి రికార్డులు, విద్యుత్ బిల్లులు, సాగుకు సంబంధించిన ఆధారాలను సంబంధిత అధికారులకు సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. భూమిని చాలా కాలంగా సాగు చేస్తున్న విషయాన్ని స్థానిక రైతులు కూడా ధ్రువీకరించగలరని పేర్కొన్నారు. భూమిపై వివాదం కారణంగా వ్యవసాయ కార్యకలాపాలు దెబ్బతింటున్నాయని, కుటుంబ జీవనోపాధిపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు శాఖలు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, భూమి హక్కుల అంశాన్ని చట్టబద్ధంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల హక్కులు పరిరక్షించబడేలా అధికారులు స్పందించాలని కోరారు. కాగా, ఈ భూమి వివాదానికి సంబంధించి మరో పక్షం అభిప్రాయం తెలియాల్సి ఉంది. పూర్తి స్థాయి విచారణ అనంతరం వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

# అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠకు రూ. లక్ష విరాళం



**తల్లాడ/, జూన్ 20 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కోడూరి ఉమాదేవివీరకృష్ణ దంపతులు రూ.1 లక్షల నగదు విరాళాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అభయాంజనేయ స్వామి ఆశీస్సులతో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందన్నారు. గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు సర్పంచ్ దంపతుల సేవా భావాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి బీసీ సెల్, బీఆర్ఎస్ నాయకులు కోడూరి వీరకృష్ణ, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఇస్నేపల్లి లక్ష్మణ్, విలసాగరం శ్రీనివాసరావు, విలసాగరం వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు కోడూరి దుర్గారావు, విలసాగరం వెంకటరావు, మాజీ సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు, బీరెడ్డి మల్లారెడ్డి, బొడ్డు శ్రీను, గుండ్ల బాలకృష్ణ, బీరెడ్డి ముత్తారెడ్డి, బొడ్డు కృష్ణ, గుండ్ల జోగారావు, బొడ్డు తిరుపతిరావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీనగర్‌లో మహిళా సంఘం భవనానికి భూమిపూజ

### రూ.10 లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మాణానికి శ్రీకారం





**భీమదేవరపల్లి/జూన్20 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలం గాంధీనగర్ గ్రామంలో రూ.10 లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న మహిళా సంఘం భవనానికి శనివారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. వివో మహిళా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వివో ప్రతినిధులు, మహిళా సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని భవన నిర్మాణం విజయవంతంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, వివిధ సామాజిక కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం ఉపయోగపడనుందని వారు పేర్కొన్నారు. మహిళా సంఘం భవనాన్ని మంజూరు చేసిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మహిళా సంఘం సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ భవనం మహిళల స్వయం సాధికారతకు తోడ్పడటంతో పాటు గ్రామాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న ఈ భవనం మహిళా సంఘాలకు శాశ్వత వేదికగా నిలిచి, గ్రామంలో మహిళల సామాజిక, ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

# రామాలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చెయ్యాలని మంత్రిని కలిసిన కొత్తపేట సర్పంచ్.



**బయ్యారం/,జూన్ 20.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి గంధంపల్లి గ్రామంలోని పురాతన శ్రీ కోదండరామాలయ పునర్నిర్మాణనికి రూ.50 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సిఫారసు లేఖను మంత్రికీ అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మంత్రితో మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం గ్రామ ప్రజల భక్తి విశ్వాసాలకు కేంద్ర బిందువుగా నిలుస్తోందని,ప్రస్తుతం ఆలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణం అత్యవసరంగా మారిందని,భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కోసం నిధులు అవసరమని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి కొండా సురేఖ సానుకూలంగా స్పందిస్తూ గంధంపల్లి శ్రీ కోదండరామాలయం అభివృద్ధి కోసం నిధుల మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు.ఆలయ పునర్నిర్మాణానికి సిఫారసు లేఖ అందించిన ఎమ్మెల్యే కోరం కనకయ్యకీ సర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చిన మంత్రి కొండా సురేఖకి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కొండా యువసేన రాష్ట్ర అధ్యక్షులు అనిల్,వార్డు సభ్యులు భూక్య శీను తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సభ, రైతు మేళాపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం

**చింతకాని,/ జూన్ 20 (జర్నలిస్ట్ వార్త):**
చింతకాని మండలంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న రైతు మేళా, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. రైతు మేళాను అన్నదాతలు సద్వినియోగం చేసుకుని ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రైతు మేళా, సీఎం పర్యటన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మధిర నియోజకవర్గ పరిధిలోని చింతకాని మండలంలో నిర్వహించే రైతు మేళాలో ఈ నెల 30న ముఖ్యమంత్రి పాల్గొనే సభను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.
రైతు మేళాలో 150 స్టాల్స్ ఏర్పాటు చేసి వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య రంగాల్లోని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు పరిచయం చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతికతను రైతులు అందిపుచ్చుకుని ఉత్పాదకతను పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతు మేళాకు హాజరయ్యే శాస్త్రవేత్తలకు అవసరమైన బస, రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.సమావేశంలో డీఆర్‌డీవో శ్రీరామ్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. పురందర్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం, పీడీ మెప్మా తదితరులు పాల్గొన్నారు.

## యూరియా బుకింగ్ యాప్‌కు రైతుల ఆదరణ

### తొలి రోజే 2,362 బుకింగ్స్ నమోదు



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూన్ 20 (జర్నలిస్ట్ వార్త):** ఖరీఫ్-2026 సీజన్‌లో రైతులకు యూరియా సరఫరాను పారదర్శకంగా, సులభతరం చేసే లక్ష్యంతో వ్యవసాయ శాఖ ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్‌కు ధర్మసాగర్ మండలంలో తొలి రోజే విశేష స్పందన లభించింది. రైతులు పెద్ద సంఖ్యలో యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవడంతో కొత్త విధానంపై ఆసక్తి వ్యక్తమవుతోంది.మండల వ్యవసాయ అధికారి రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం, యాప్ ప్రారంభమైన మొదటి రోజే 2,362 బుకింగ్స్ నమోదు కాగా, మొత్తం 7,654 యూరియా బ్యాగులు బుక్ అయ్యాయి. బుక్ అయిన వాటిలో 2,765 బ్యాగులను రైతులకు విక్రయించగా, ప్రస్తుతం 1,262 బ్యాగులు అందుబాటులో ఉన్నాయి.యూరియా పంపిణీలో అక్రమాలకు తావులేకుండా రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తోందని ఆయన తెలిపారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా ముందస్తుగా యాప్‌లో బుకింగ్ చేసుకోవడం వల్ల ఎరువుల కోసం వేచి ఉండాల్సిన అవసరం తగ్గుతుందన్నారు.మండలంలోని ఎరువుల నిల్వలు, సరఫరా పరిస్థితులను వ్యవసాయ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని రాజేష్ పేర్కొన్నారు. రైతులు యూరియా బుకింగ్ యాప్‌ను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు."రైతులకు సకాలంలో, పారదర్శకంగా యూరియా అందించడమే లక్ష్యం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అవసరమైన మేరకు నిల్వలు అందుబాటులో ఉంచుతున్నాం అని మండల వ్యవసాయ అధికారి రాజేష్ తెలిపారు.

## ఘనంగా ఉప్పుల మైసమ్మ ఆలయ భూమి పూజ





**దామరచర్ల/ జూన్ 19(జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని రాళ్లవాగు తండ గ్రామంలో ఉప్పుల మైసమ్మ తల్లి (బోట్కు భవాని) గుడి నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధీరావత్ శంకర్ నాయక్, ఉపసర్పంచ్ నాగమణి కిషన్, వార్డు సభ్యులు కోట నాయక్, మంగ కిషన్ నాయక్, శివాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధీరావత్ మోహన్ నాయక్ పాల్గొని మాట్లాడారు.
గ్రామ ఆధ్యాత్మిక వాతావరణానికి, అభివృద్ధికి ఈ ఆలయ నిర్మాణం ఎంతో దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేస్తామని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొండ్రపోల్ మాజీ సర్పంచ్ మాన్య నాయక్, మాజీ ఉపసర్పంచ్ నాగు నాయక్, ధీరావత్ వంశీ నాయక్, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధనలను అందించాలి.

-జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.





**బయ్యారం/,జూన్ 20.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ విస్తృతంగా పర్యటించారు.మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల,జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల,అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి పిల్లలతో స్వయంగా మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ,విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన డైట్ మెనూ ప్రకారం పక్కాగా బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, స్నాక్స్ అందించాలని,పిల్లలకు అర్థమయ్యే రీతిలో డిజిటల్ తరగతుల ద్వారా విద్య బోధనలు అందించాలని,బడిబాట కార్యక్రమానికి మరింత అవగాహన కల్పించి తద్వారా నమోదు శాతం పెంచేందుకు అన్ని విద్యాసంస్థల సిబ్బంది కృషి చేయాలని సూచించారు, మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తున్న సిబ్బంది, కిందిస్థాయి ఉద్యోగులకు కచ్చితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు,
ప్రతి ఒక్కరికి టెక్ట్స్ బుక్స్,నోట్ బుక్స్ అందించాలని,ఇంగ్లీషులో ప్రావిణ్యం పొందడం కోసం ఉపాధ్యాయులు ఇంగ్లీషులోనే పిల్లలకు విద్యబోధన చెయ్యాలన్నారు.ఉపాధ్యాయులు విద్య బోధన పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదేశించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు బలవర్ధకమైన ఆహారం అందించాలని,కోడిగుడ్లు, బాలామృతం కలిగిన నాణ్యమైన పదార్థాలను అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, బయ్యారం తహసిల్దార్ నాగరాజు,ఎంపిడిఓ దీపిక,ఎంఈఓ లక్ష్మణ్ నాయక్,యస్ఐ ప్రశాంత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# యోగా సాధన ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి.

-తహసీల్దార్ నాగరాజు.



**బయ్యారం/,జూన్ 20.(జర్నలిస్ట్ వార్త)**ప్రతి వ్యక్తి నిత్య జీవితంలో యోగా సాధనను అలవాటు చేసుకోవాలని అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా బయ్యారం మండల తహసీల్దార్ నాగరాజు అన్నారు.యోగా ద్వారా ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చున్నారు. శారీరక,మానసిక,రోగ నిరోధకశక్తిని పెంచుకోవడానికి యోగా బాగా ఉపయోగపడుతున్నదని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన చేసి ఆరోగ్యంగా ఉండాలని తహసీల్దార్ ఆకాంక్షించారు.

# విద్యార్థుల్లో చైతన్యం కోసమే గో టు విలేజ్

- ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్ బిర్రు మహేందర్ మాదిగ - దత్తాయిపల్లిలో ఘనంగా కార్యక్రమం.. నేతల సన్మానం









**తుర్కపల్లి/ జూన్ 20 (జర్నలిస్ట్ వార్త):**
మాదిగ జాతి విద్యార్థులలో అక్షరాస్యతను పెంపొందించి, వర్గీకరణ ఫలాలను అందరికీ అందేలా చేయడమే గో టు విలేజ్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ బిర్రు మహేందర్ మాదిగ పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపులో భాగంగా శనివారం తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి గ్రామపంచాయతీ ఆవరణంలో ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో గో టు విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్రస్వామి మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బిర్రు మహేందర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దశాబ్దాల పోరాటాల ఫలితంగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాధించుకున్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఫలాలను గ్రామాల్లోని విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం ప్రతి ఒక్కరినీ చైతన్యపరచడమే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతి ఆత్మగౌరవ పతాకమైన ఎమ్మార్పీఎస్ గద్దెలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. రానున్న జూలై 7వ తేదీన నిర్వహించబోయే ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పండగ వాతావరణంలో, ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున జరుపుకోవాలని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను బలోపేతం చేయాలన్నారు.
అనంతరం, ఇటీవల దళిత రత్న అవార్డు గ్రహీత బిర్రు మహేందర్ మాదిగను, నూతనంగా గెలుపొందిన సర్పంచ్





కర్ణాకర్ మాదిగను గ్రామస్థులు, పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ, గ్రామ సర్పంచ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కర్ణాకర్ మాదిగ, మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర నాయకులు బిర్రు కరుణాకర్ మాదిగ, రాజు మాదిగ, గణేష్ మాదిగ, సాంబయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ స్తంభమే కాటేస్తుందా..!?

**వల్భాపూర్‌లో ప్రమాదకరంగా మారిన ఇనుప పోల్**

**కరెంట్ సరఫరా కొనసాగుతున్నా పట్టించుకోని అధికారులు**

**ప్రాణాలు పోయాక స్పందిస్తారా అంటూ గ్రామస్తుల ఆగ్రహం**

**ఎల్కతుర్తి,/ జూన్ 20 (జర్నలిస్ట్ వార్త):** విద్యుత్ సరఫరా చేసే స్తంభమే ప్రాణాలకు ముప్పుగా మారితే..? అధికారులు ఫిర్యాదులు వినిపించుకోకపోతే..? ఎల్కతుర్తి మండలం వల్భాపూర్ గ్రామంలో ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామానికి చెందిన ఉడుత సూర్యనారాయణ ఇంటి ఎదుట ఉన్న పాత ఇనుప విద్యుత్ స్తంభం ప్రమాదకర స్థితికి చేరుకున్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దాదాపు ఐదు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఈ ఇనుప స్తంభం ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా ఆ స్తంభం ద్వారా ఇప్పటికీ విద్యుత్ సరఫరా కొనసాగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సమీప నివాసితులు



భయాందోళనలకు గురవుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారిందని అంటున్నారు.
బాధితుడు ఉడుత సూర్యనారాయణ మాట్లాడుతూ, స్తంభం ప్రమాదకరంగా మారిన విషయాన్ని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. "ఏదైనా ప్రమాదం జరిగే వరకు అధికారులు స్పందించరా?" అని ప్రశ్నించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అంబాల గౌతమ్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పాత ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ, వల్భాపూర్‌లో మాత్రం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గ్రామ విద్యుత్ వ్యవస్థపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని మండిపడ్డారు.వర్షాలు, గాలుల సమయంలో పాత ఇనుప స్తంభం కూలిపోయే ప్రమాదం ఉందని, అలా జరిగితే ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగాక విచారం వ్యక్తం చేయడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వెంటనే మార్చాలని డిమాండ్

ప్రమాదకరంగా మారిన ఇనుప విద్యుత్ స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో కొత్త సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా దుర్ఘటన జరిగేలోపు విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.
"ప్రజల ప్రాణాల కంటే ఏదీ ముఖ్యం కాదు. ప్రమాద హెచ్చరికలు వచ్చిన తర్వాత కూడా అధికారులు స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తోంది" అని గ్రామస్తులు పేర్కొన్నారు.

# తెల్లవారుజామునే జేసీబీలు...

## రోడ్డున పడ్డ 350 కుటుంబాలు

**గుండ్ల సింగారంలో గుడిసెల తొలగింపు కలకలం**

**చిన్నారులు, మహిళల ఆర్తనాదాలు**

**అడ్డుకున్న సీపీఐ నేతల అరెస్టు**

**పునరావాసం లేకుండానే కూల్చివేతలపై ప్రశ్నలు**



**హనుమకొండ, జూన్ 20 (జర్నలిస్ట్ వార్త):** ఐదేళ్లుగా తలదాచుకున్న గుడిసె ఒక్క క్షణంలో నేలమట్టమైతే... జీవితమే శూన్యంగా మారుతుంది. హనుమకొండ జిల్లా గుండ్ల సింగారంలో శనివారం అదే దృశ్యం కనిపించింది. తెల్లవారుజామునే భారీ పోలీసు బందోబస్తుతో అధికారులు రంగంలోకి దిగి వందలాది గుడిసెలను తొలగించడంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు కన్నీరుమున్నీరయ్యారు. ఒకవైపు జేసీబీలు గుడిసెలను కూల్చుతుండగా, మరోవైపు తమ సామాన్లు కాపాడుకునేందుకు బాధితులు పడిన అవస్థలు హృదయ విదారకంగా మారాయి.

ఉదయం 5 గంటల ప్రాంతంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్ శాఖల సిబ్బంది, సుమారు 200 మంది పోలీసుల బందోబస్తుతో గుండ్ల సింగారం ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం ఐదు జేసీబీలతో గుడిసెల తొలగింపు ప్రారంభించారు. స్థానికుల సమాచారం ప్రకారం సుమారు 350 కుటుంబాలు ఈ చర్యతో నివాసాలు కోల్పోయాయి.

**"ఇప్పుడు మా పిల్లలతో ఎక్కడికి వెళ్లాలి?"**

గుడిసెలు కోల్పోయిన కుటుంబాల ప్రశ్నకు సమాధానం కనిపించడం లేదు. "ఐదేళ్లుగా ఇక్కడే జీవిస్తున్నాం. పిల్లలు ఇక్కడి నుంచే బడికి వెళ్తున్నారు. ఆధార్, రేషన్ కార్డులు కూడా ఉన్నాయి. ఒక్కసారిగా వెళ్లిపోమంటే ఎక్కడికి వెళ్లాలి?" అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

గుండ్ల సింగారానికి చెందిన రమ కన్నీటి పర్యంతమవుతూ, "నిన్న వరకు ఎలాంటి సమాచారం లేదు. ఈరోజు తెల్లవారుజామునే వచ్చి గుడిసెలు కూల్చేశారు. పిల్లలు ఉన్నారని చెప్పినా వినలేదు. మమ్మల్ని ఇక్కడే చంపినా సరే, వెళ్లమంటే ఎలా వెళ్తాం?" అని ప్రశ్నించారు.

**అడ్డుకున్న వారిపై నిర్బంధం**

గుడిసెల తొలగింపును అడ్డుకునేందుకు ప్రయత్నించిన సీపీఐ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, మండల కార్యదర్శి ఎన్.ఏ. స్టాలిన్‌తో పాటు పలువురు నాయకులను కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**మండుటెండలోనే బతుకుబండి**

గుడిసెలు కూలిపోయినా వెళ్లేందుకు చోటు లేక బాధిత కుటుంబాలు అదే ప్రాంతంలో సామాన్ల మధ్య కాలం గడుపుతున్నాయి. మహిళలు ఎండలోనే వంటలు చేసుకుంటుండగా, చిన్నారులు నీడ కోసం అల్లాడుతున్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న వేళ తలదాచుకునేందుకు కూడా చోటు లేకపోవడం వారి ఆందోళనను మరింత పెంచుతోంది.

**కూల్చివేతలకన్నా ముందుగా పునరావాసమే ముఖ్యం!**

ప్రభుత్వ భూములను పరిరక్షించడం అధికారుల బాధ్యతే. అయితే పేదల జీవన హక్కులను కాపాడడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. ఏళ్లుగా నివాసం ఉంటున్న కుటుంబాలను ఖాళీ చేయించే ముందు పునరావాసం కల్పించారా? ప్రత్యామ్నాయ స్థలం చూపించారా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

గుండ్ల సింగారం ఘటన మరోసారి పేదల గృహ హక్కుల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చింది. బాధిత కుటుంబాల అర్హతలను పరిశీలించి, వెంటనే పునరావాసం లేదా గృహస్థలాల కేటాయింపుపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని స్థానికులు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి. గుడిసెలు కూల్చడం ఒకరోజు పని కావచ్చు.. కానీ ఆ గుడిసెల్లోని జీవితాలను మళ్లీ నిలబెట్టడం ప్రభుత్వానికి అసలైన పరీక్షగా మారింది.







# వర్ధన్నపేట పంచాయతీ కార్యదర్శుల సంఘం ఏకగ్రీవం

**-అధ్యక్షుడిగా ఎస్కే. హుస్సేన్, జనరల్ సెక్రటరీగా శ్రీకర్ కుమార్ గౌడ్**

**- సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి: ఎంపీడీవో వెంకటరమణ**

**వర్ధన్నపేట/ జూన్ 20(జర్నలిస్ట్ వార్త):** మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గంట వెంకటరమణ ఆధ్వర్యంలో, ఎంపీఓ జుమ్మిలాల్ సమక్షంలో ఈ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా ఎస్కే. హుస్సేన్, జనరల్ సెక్రటరీగా శ్రీకర్ కుమార్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా రేమల్లి శంకర్రావు, ట్రెజరర్‌గా అన్వేష్ గౌడ్, ఉపాధ్యక్షురాలిగా జ్యోతిలత, అసోసియేటివ్ ప్రెసిడెంట్‌గా రమేష్, కల్చరల్ సెక్రటరీగా సహజలను ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సురేష్, అనిత, అడ్వైజరీ సెక్రటరీగా రాజు, పబ్లిసిటీ ఆర్గనైజర్‌గా నాగరాజుతో పాటు సభ్యులుగా కళ్యాణి, సరిత, రోజా, దివ్య, రత్నంరాజు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కార్యదర్శులంతా సమన్వయంతో విధులను నిర్వహిస్తూ మండల పరిధిలోని గ్రామాలను ప్రగతి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన బాధ్యులను తోటి కార్యదర్శులు, సిబ్బంది ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



అధ్యక్షుడు ఎస్కే. హుస్సేన్



జనరల్ సెక్రటరీ శ్రీకర్ కుమార్ గౌడ్



గౌరవ అధ్యక్షుడు రేమల్లి శంకర్రావు,

# మహిళా చైతన్యానికే ప్రభుత్వం పెద్దపీట

## రూ.10 లక్షల ఇందిరా భవన పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు





**వర్ధన్నపేట/జూన్ 20(జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మండల పరిధిలోని రామోజీ కుమ్మరిగూడెం తండాలో రూ.10 లక్షల వ్యయంతో మంజూరైన విజయలక్ష్మి గ్రామైక్య సంఘం ఇందిరా భవన నిర్మాణ పనులకు శనివారం సర్పంచ్ భూక్యా సుశీల అధ్యక్షతన ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి సర్కార్ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, వడ్డీ లేని రుణాలు అందించడంతో పాటు ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చి గౌరవించిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సంఘాలను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. అనంతరం తండాలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి భోజన వసతులను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవన నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని, తక్షణ సహాయం కింద తాత్కాలిక రేకుల షెడ్డు నిర్మాణానికి తన సొంత జీతం నుండి రూ.10 వేలను సర్పంచ్‌కు అందజేశారు.

**బాధిత కుటుంబానికి అండగా ఉంటాం:**

మండలంలోని భవానికుంట తండాలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన బానోత్ గణేష్ భౌతికకాయాన్ని వర్ధన్నపేట మార్చురీలో ఎమ్మెల్యే సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా పూర్తి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ చైర్మన్ ప్రభాకర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ సారంగపాణి, పీఏసీఎస్ చైర్మన్ రాజేష్ కన్నా, కాంగ్రెస్ నేతలు ఎద్దు సత్యం, పోషాల వెంకన్న గౌడ్, భూక్యా చిన్న శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళల ఆర్థిక పురోగతికే ప్రభుత్వం పెద్దపీట





**పర్వతగిరి/జూన్ 20(జర్నలిస్ట్ వార్త):** గ్రామీణ ప్రాంతాల మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మండల పరిధిలోని మాల్యా తండాలో గ్రామ సమాఖ్య సంఘ భవన నిర్మాణ పనులకు శనివారం ఆయన భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక భవనాల ఏర్పాటుతో మహిళలకు మరింత భరోసా లభిస్తుందని, ఇక్కడ సమావేశాలు నిర్వహించుకుంటూ స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పనులను సకాలంలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ నాగపద్మజ, తహసిల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్ నాయక్, సర్పంచ్ మంజుల, కాంగ్రెస్ నేతలు పిన్నింటి అనిల్ రావు, జాటోత్ శ్రీనివాస్ నాయక్, వివిధ గ్రామాల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి

## ఆర్ఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లందాస్ కుమార్ డిమాండ్



**వర్ధన్నపేట/జూన్ 20(జర్నలిస్ట్ వార్త);** దేశంలో పరీక్షల నిర్వహణ లోపాలు, పేపర్ లీకేజీల వల్లే విద్యార్థులు తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లందాస్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల దేశవ్యాప్తంగా 11 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం విచారకరమన్నారు. నీట్ పరీక్షల లీకేజీ, రీ-టెస్ట్ ఒత్తిడి తట్టుకోలేక యువత ప్రాణాలు కోల్పోతుంటే కేంద్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటోందని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ బాధిత, మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు కేంద్రం రూ.కోటి చొప్పున నష్టపరిహారం అందించాలన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ విద్యావ్యవస్థలో ప్రధాని మోదీ తగిన సంస్కరణలు తీసుకురావాలని కుమార్ సూచించారు.

# విద్యతోనే దళిత వర్గాలకు సకల గౌరవాలు

## ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు వంగూరి ఆనందరావు మాదిగ



**వర్ధన్నపేట/జూన్ 20(జర్నలిస్ట్ వార్త):** దళిత వర్గాల విద్యార్థులు విద్యకు ఎంత చేరువైతే సమాజం నుండి అంతగా సకల సౌకర్యాలు, గౌరవాలు దక్కుతాయని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకుడు వంగూరి ఆనందరావు మాదిగ అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో శనివారం జిల్లా సీనియర్ నాయకుడు జిల్లా ధర్మయ్య మాదిగ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 32 ఏళ్ల సుదీర్ఘ పోరాటాలు, ఎందరో త్యాగాల ఫలితంగానే సుప్రీంకోర్టు ద్వారా ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధించుకున్నామని గుర్తుచేశారు. ఈ వర్గీకరణ ఫలాలను అందుకోవాలంటే మాదిగ, ఉపకులాల విద్యార్థులు చదువుల్లో రాణించాలని, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని కోరారు. జూలై 7న రానున్న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి పల్లె, బస్తీల్లో జెండా దిమ్మెలను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ముత్యాల మల్లేష్, వర్షపాక కుమార్, చాడ కరుణాకర్, మరుపట్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిట్టీల వ్యాపారం చేస్తున్న టీచర్ సస్పెన్షన్




**హన్మకొండ,జూన్ 20(జర్నలిస్ట్ వార్త): :** చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్న గవర్నమెంట్ టీచర్‌పై వేటుపడింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి జడ్పీ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కలువల ఎల్లయ్యను సస్పెండ్ చేశారు. ఈ మేరకు డీఈవో గిరిరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ, మోసాలకు పాల్పడుతున్నాడని ఇటీవల కలువల ఎల్లయ్యపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఆరోపణలపై విచారణ కోసం కలెక్టర్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ జరిపిన ప్రాథమిక విచారణలో నేరం రుజువు కావడంతో డీఈవో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.